సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



అభివృద్ధి పనుల పరిశీలన

మోడల్ టౌన్‌లో భాగంగా పులివెందులలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ట్రైనీ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ శనివారం పరిశీలించారు. -8లో



చెలరేగిన చిత్తూరు బ్యాట్స్‌మన్

కడపలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు బ్యాట్స్‌మెన్ ఆశిష్‌రెడ్డి కర్నూలు జట్టుపై 202 పరుగులు సాధించారు. మరో మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు పోటీపడ్డాయి. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3/23.3

జిల్లాలో శనివారం 23.3 - 36.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన



డ్రోన్‌పై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో యంత్రా 2కె23 సదస్సులో భాగంగా శనివారం డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మెకానికల్ విభాగాధిపతి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సుల్లో డ్రోన్ ఏవిధంగా ఉపయోగించాలనే అంశంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కష్టపడితేనే తగిన గుర్తింపు వస్తుందన్నారు. జాతీయస్థాయిలో యంత్ర 2కె 23 సదస్సు పులివెందుల జేఎన్టీయూలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వైవీయూలో ధ్రువపత్రాల పరిశీలన



ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయం

వైవీయూ: ఏపీ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో వైవీయూలో పీజీ ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీసెట్-23లో ర్యాంకు పొంది, వైవీయూలో పీజీ సీటు లభించిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పరిశీలిస్తామని, అనంతరం ఫీజు చెల్లింపు ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు. పీజీ సీటు పొందిన విద్యార్థులందరూ వైవీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయం ప్రాంగణంలో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

18 నుంచి బీహెచ్ఈఎల్‌కు ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ: దసరా సెలవులను పురస్కరించుకుని మదనపల్లె నుంచి బీహెచ్ఈఎల్‌కు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ ని రంజన్ తెలిపారు. 18వ తేదీ నుంచి 22వతేదీ వరకు అల్ట్రాడీలక్స్ బస్సులు తిరుగుతాయని చెప్పారు. అలాగే బీహెచ్ఈఎల్ నుంచి మదనపల్లెకు కూడా బస్సులు నడుపుతామన్నారు. టిక్కెట్టు రూ.925 చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లయోలా విద్యార్థి ప్రతిభ



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ముస్తాఖీం పటాన్

పులివెందుల టౌన్: స్థానిక లయోలా (వైఎస్ఆర్ఆర్) పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ముస్తాఖీం పటాన్ రాష్ట్ర స్థాయిలో మూడు విభాగాల్లో రాణించి భళా అనిపించారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో ఈసీఈ విభాగంలో జరిగిన ప్రాజెక్టు ఎక్స్‌పోలోనూ, సీఎస్ఈ విభాగంలో జరిగిన టెక్నికల్ క్విజ్‌లోనూ ప్రథమ స్థానం సాధించారు. సీఎస్ఈ విభాగంలో జరిగిన ప్రాజెక్టు ఎక్స్‌పోలో ద్వితీయ బహుమతి గెలుచుకుని సత్తా చాటారు. తమ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో సత్తా చాటడంతో ప్రిన్సిపల్ బ్రిట్టో ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి ఊతం.. ఉద్యానం ఘనం

మామిడి తోటతో ఆదాయం



ఈయన పేరు దుగ్గల పుల్లారెడ్డి. ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లె గ్రామ రైతు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉంది. సుస్థిర ఆదాయ మార్గాల ద్వారా జీవనోపాధి పొందేందుకు పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మామిడి తోట ఏర్పాటు చేసేందుకు ఉపాధి హామీ పథకం కింద రూ.1,57,342 అవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తానికి 323 పనిదినాలకు సాంకేతిక ఆమోదం, పరిపాలనా అనుమతి లభించింది. మూడేళ్ల తర్వాత మామిడి తోటలో నిరంతర ఆదాయంతో పాటు దీర్ఘకాలిక జీవనోపాధికి మార్గం ఏర్పడిందని రైతు పుల్లారెడ్డి చెబుతున్నారు. పైగా తన భూమికి విలువ పెరిగిందన్నారు.

చెట్టుకు 100 కాయలు



పచ్చగా కళకళలాడుతున్న పొలంలో ఉన్న ఈ రైతు పేరు కె.వెంకటసుబ్బయ్య. ఈయనది ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లె. వ్యవసాయ పంటల సాగులో అలసిపోయిన ఆయన పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. సాగునీటి సమస్య అధిగమించేందుకు బిందు సేద్యం ఎంచుకున్నారు. అంతర పంటలు సాగు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ సాయంతో బత్తాయి తోట ఏర్పాటు చేసుకున్నారు. తొలి కాపులోనే గణనీయమైన ఆదాయం గడించారు. ఒక్కొక్క చెట్టుకు 70 నుండి 100 కాయల కాపు వచ్చింది. దీర్ఘకాలిక ఆదాయ వనరులైన పండ్లతోటల ఏర్పాటుతో ఎంతో ఉపయోగకరంగా మారింది.



సాగులో ఉన్న డ్రాగన్ పంట

వ్యవసాయ పంటలు కలిసిరాక, కష్టాల సాగులో కొట్టుమిట్టాడుతున్న రైతన్నలకు ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఊతంగా నిలుస్తోంది. అదనపు ఆదాయ ఫలం చేతికందేలా రాయితీపై ఉపాధి పథకం కింద నిధులు కేటాయిస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు మరింత వెన్ను దన్నుగా నిలిచేందుకు మొక్కలు, నిర్వహణ ఖర్చులు, ఎరువులు అందిస్తోంది. ఆసక్తి, అర్హులైన రైతులకు బిందు సేద్యం పరికరాలతో చేయూతనిస్తోంది. జిల్లాలో పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇదంతా వెరసి రైతుల వ్యవసాయ పొలాలు ఉద్యాన పంటలతో కళకళలాడుతోన్నాయి.

- ఉద్యాన పంటల సాగుకు అన్నదాతల మొగ్గు
- జాబ్ కార్డు ద్వారా రైతుకు వంద రోజుల పని దినాలు
- ఫలసాయంతో మెరుగవుతున్న జీవన ప్రమాణాలు



సాక్షి ప్రతినిధి, కడప: రైతులు మూస పద్ధతిలో వ్యవసాయ పంటలు సాగుచేయకుండా, నిత్య విద్యార్థిలా మారితే వ్యవసాయం పండుగగా మారుతుందని నిపుణులు వివరిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు ఉద్యాన పంటలు ఏర్పాటు చేసుకొనేందుకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని ముందడుగు వేస్తున్న రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 125 మంది రైతులు 322 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 231 మంది రైతులు 592 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశారు. వ్యవసాయ పంటలకంటే ఉద్యాన పంటల్లో సాగు యాజమాన్య ఖర్చు తక్కువ కావడంతో వంద శాతం ఈ పథకం రైతులకు ఆసక్తిగా నిలుస్తోంది.

లాభసాటిగా ఉద్యాన పంటలు

వరి, పసుపు, చెరకు లాంటి పంటలను సాగు చేస్తుండడంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఆరుతడి పంటల సాగుతో నీరు సద్వినియోగం కావడమే కాకుండా, పంటలు ఏపుగా రానున్నట్లు నిపుణులు వివరిస్తున్నారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు లాభసాటిగా నిలుస్తున్నాయి. నర్సరీ నుంచి పంట సాగు, డ్రిప్ వరకూ సాయం అందిస్తూ ఉపాధి హామీ పథకం అన్నదాతలకు దన్నుగా నిలుస్తోంది. బత్తాయి, మామిడి లాంటి దీర్ఘకాలిక ఫలసాయం సాధించే పంటలు సాగు చేయడంతో వారికి లాభసాటిగా నిలుస్తున్నాయి. ఎప్పుడూ నష్టాలు చవిచూసే రైతన్నలు మెరుగైన యాజమాన్య పద్ధతుల ద్వారా గణనీయంగా లాభాలు గడిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

డ్రాగన్ ఫ్రూట్‌తో లాభాలు



ఉపాధి హామీ పథకం ద్వారా లభిస్తున్న ప్రోత్సాహాన్ని తెలుసుకొని అర ఎకరం పొలంలో డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పెంచుకున్నా. మొక్క నాటేందుకు అవసరమైన సామాగ్రి ఏర్పాటు నిమిత్తం ఉపాధి హామీ పథకం కింద రూ.1.86 లక్షల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. కంటికి రెప్పలా పంటను కాపాడుకున్న నాకు తొలి సంవత్సరంలోనే 700 కిలోల డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయం లభించింది. ఈ పండుతో ఆరోగ్యంగా ఉంటారని తెలియడంతో మార్కెట్‌లోనూ కొంత డిమాండ్ ఏర్పడింది. 2021 నుంచి పంట లాభాలు దక్కడంతో గణనీయమైన ఆదాయం లభిస్తోంది.

-ఎం సుబ్బయ్య, యువ రైతు, దిరసవంచ గ్రామం, బి.మఠం మండలం

నాగసూరికి జానమద్ది పురస్కారం



నాగసూరి వేణుగోపాల్

కడప కల్చరల్: నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి సాహితీ పురస్కారం విశ్రాంత ఆకాశవాణి సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు అందజేయనున్నట్లు జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. తన తండ్రి పేరిట ఏటా అందజేస్తున్న ఈ పురస్కారాన్ని నవంబరు 5న కడపలోని బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించే సభలో వేణుగోపాల్‌కు అందజేస్తామన్నారు. పలు వురు సాహితీవేత్తలు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు.

ఆరోగ్య భాగ్యం



పల్లవోలులో వైద్యం అందిస్తున్న సిబ్బంది

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు స్థానిక ప్రజలు తరలివచ్చి ఉచిత వైద్య సేవలను పొందుతున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం చక్కని సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురి కావడం లేదు. శనివారం మొత్తం 32 ప్రాంతాల్లో ఈ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. కడప నగరం వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, డిప్యూటీ కమిషనర్ రమణా రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. యర్రగుంట్ల మండలం పెద్దనపాడులో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జడ్పీటీసీ నరేన్‌రామంజులురెడ్డి, రాజుపాలెం మండలం తొండలదిన్నె గ్రామంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, అట్లూరు మండలం ఎస్.వెంకటాపురంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ శిబిరాల్లో పాల్గొన్నారు.

విద్య, క్రీడలకు అధిక ప్రాధాన్యం



కపోతాలను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, తదితరులు



ఓ మ్యాచ్‌లో పోటీ పడుతున్న వాలీబాల్ జట్లు

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

మైదుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు క్రీడలకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీ మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ టోర్నమెంట్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డితో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. 13 జిల్లాల వాలీబాల్ జట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గౌరవ వందనం సమర్పించగా, కపోతాలను ఎగురవేసి క్రీడలను వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ నవంబర్‌లో శ్రీనగర్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైక్రీడా కారులు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్ విజేతలుగా నిలిచే జట్లకు వరుస బహుమతులుగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎంవీ.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థలకు దీటుగా విద్యారంగాన్ని తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ ఈ నాలుగున్నరేళ్లలో రూ.53 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు మాట్లాడుతూ అంతర్ జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్‌ను మైదుకూరులో నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించిందని, ఇక్కడే బాలురు, బాలికల రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు సుధీర్ డ్యాన్స్ అకాడమీ నృత్య ప్రదర్శన, మేధా డిఫెన్స్ అకాడమీ వారి పిరమిడ్ విన్యాసం అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, కమిషనర్ వై.రంగస్వామి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సిబ్బంది బి.అరుణ కుమారి, ఎం.వసంత, కరస్పాండెంట్ సి.నరసింహులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

వాలీబాల్ పోటీలు స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీ మైదానంలో శనివారం హోరాహోరీగా సాగాయి. తొలిరోజున బాలుర విభాగంలో జరిగిన పోటీల్లో తూర్పుగోదావరి జట్టు కృష్ణపై, విజయనగరం జట్టు విశాఖపట్నంపై, నెల్లూరు జట్టు కడపపై, ప్రకాశం జట్టు గుంటూరుపై, అనంతపురం జట్టు చిత్తూరుపై గెలుపొందాయి. బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జట్టుపై కర్నూలు, చిత్తూరు జట్టుపై ప్రకాశం, నెల్లూరు జట్టుపై కడప, కృష్ణ జట్టుపై శ్రీకాకుళం, తూరు గోదావరి జట్టుపై అనంతపురం, శ్రీకాకుళం జట్టుపై విశాఖపట్నం, గెలుపొందాయి. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సాజిత్, రమేష్ యాదవ్, నిత్య ప్రభాకర్, ప్రవీణ్, కిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, వీరాంజనేయులు, నరసరాజు, రమేష్ బాబు తదితరులు రెఫరీలుగా వ్యవహరించారు.

మూడు రోజులే గడువు

- 30085 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు
- 93 శాతం రైతుల ఈకేవైసీ పూర్తి



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది(ఫైల్)

కడప అగ్రికల్చర్: ఏ కాలంలో ఏ పంట సాగు చేశారు అనే సమాచారం ఈ క్రాప్ ద్వారా సేకరిస్తారు. విపత్తులు సంభవించి పంటలు చేతికి రాకపోతే ప్రభుత్వం ఇచ్చే పంటల బీమా అందాలన్నా ఈ క్రాప్ తప్పనిసరి. జిల్లాలో ఈ క్రాపు నమోదుకు ఈ నెల 10వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ఇప్పటికే వందశాతం ఈ క్రాప్ పూర్తి చేసిన వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఈకేవైసీ నమోదు వేగవంతం చేసింది.

- వైఎస్సార్ జిల్లాలోని కడప, పోరుమామిళ్ల, మైదుకూరు, కమలాపురం, పొద్దుటూరు, బద్వేల్, ముద్దనూరు వ్యవసాయ డివిజన్ల పరిధిలోని 36 మండలాల్లో 3,00,585 ఎకరాల్లో ఈ ఏడాది వివిధ పంటలు సాగు చేశారు. వ్యవసాయ సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి 3,00,585 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు పూర్తి చేసి వందశాతం ఘనత సాధించారు. ఇక ఈకేవైసీపై దృష్టి పెట్టి దాదాపు 2,78,024 ఎకరాలకు పూర్తి చేశారు. ఇప్పటికే 93 శాతం ఈకేవైసీ పూర్తయిందని, 22,561 ఎకరాలకు మూడు రోజుల్లో పూర్తి చేసి వందశాతం సాధించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు.

గతం కంటే భిన్నంగా

ఈ క్రాప్ నమోదు ప్రక్రియ గత ఏడాది కంటే ఈసారి భిన్నంగా జరిగింది. గతంలో రైతు సాగు చేసే పంటల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారి నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం, రైతు పొలం వద్ద ఫొటో తీసి పంపడం జరిగింది. దీంతో పంటల వివరాల్లో స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వం ఈ ఏడాది నూతన విధానం అమలు చేస్తోంది. గ్రామ వ్యవసాయ సహాయకుల ట్యాబ్‌లో నూతన సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేసి జియో ఫెన్సింగ్‌తో అనుసంధానం చేసింది. దీంతో సిబ్బంది పొలం వద్దకు వెళ్లినప్పుడు మాత్రమే ఆ వివరాలు కనిపిస్తాయి. దీంతో వ్యవసాయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు తప్పనిసరిగా పొలం వద్దకే వెళ్లి వివరాలు నమోదు చేయాల్సి వచ్చింది. కొంత ఆలస్యం కావడంతో ఈ నెల పదో తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించింది.

వంద శాతం పూర్తి చేస్తాం



ఈ క్రాప్ నమోదు వంద శాతం పూర్తి చేశాం. ఈకేవైసీకి సంబంధించి కేవలం 22561 ఎకరాల్లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది. దీనిని ఈ నెల 10వ తేదీ నాటికి వందశాతం పూర్తి చేస్తాం.

- అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయాధికారి

మాతృ మరణాలకు అడ్డుకట్ట



సమీక్షా సమావేశంలో పాల్గొన్న డాక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్: మాతృ మరణాలకు అడ్డుకట్ట వేయాలని వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ (ఎంసీహెచ్) డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో జరిగిన మాతృ మరణాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్, రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించి జాబితాను సిద్ధం చేసుకోవాలని, ఐరన్ సుక్రోజ్ టీకాలు ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రసవ ప్రణాళిక ద్వారా గర్భిణులకు ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుపాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెలా 9న వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలను పాటించి మాతృ మరణాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డాక్టర్ రాఘవేంద్ర తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో విద్యార్థికి పతకం



మెడల్‌తో ఓబుళరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా రైఫిల్ షూటింగ్‌లో దేవాంగ పేటకు చెందిన భాస్కర్‌రెడ్డి, కల్పనల కుమారుడు ఓబుళరెడ్డి ప్రతిభ కనబరిచాడు. ఏపీ నుంచి ముగ్గురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా ఓబుళరెడ్డి ప్రతిభ చూపి పతకం అందుకున్నాడు. తిరుపతిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఓబుళరెడ్డి గతంలో జరిగిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్, టీఆర్‌జీ-1, 2 పోటీల్లోనూ రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మెడల్ సాధించడంతో విద్యార్థి తల్లిదండ్రులను పాఠశాల అధ్యాపకులు సత్కరించారు.

14న పుష్పగిరిలో సామూహిక పిండ ప్రదానం

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో పవిత్ర పెన్నా నది ఒడ్డున గల రుద్ర పాద ఆలయం వద్ద ఈ నెల 14న పితృదేవతలకు అత్యంత ప్రీతికరమైన మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని పుష్పగిరి శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక పిండ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం వుంటుందని తెలిపారు. కుల, మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా తమ పితృదేవతలతోపాటు పరమపదించిన వారికి పిండ ప్రదానం చేయవచ్చునని వివరించారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

చెలరేగిన చిత్తూరు బ్యాట్స్‌మెన్

- డబుల్ సెంచరీ చేసిన ఆశిష్‌రెడ్డి
- సెంచరీ చేసిన ధరణికుమార్ నాయుడు



పోటీపడుతున్న కడప, అనంతపురం జట్లు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం కడప నగరంలోని కేఓఆర్‌ఎం క్రీడా మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 285 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులోని జి.ఎస్.ఆశిష్‌రెడ్డి 187 బంతుల్లో 202 పరుగులతో డబుల్ సెంచరీ నమోదు చేశాడు. ఈయనకు జతగా ఇ.ధరణికుమార్‌నాయుడు 117 బంతుల్లో 120 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాత్విక్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్‌ఎం మైదానంలో..

కడప నగరంలోని కేఎస్ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మరోమ్యాచ్‌లో అనంతపురం, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 77 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని మహేంద్రారెడ్డి 101 పరుగులు చేశాడు. కడప బౌలర్ ఆదిల్ హుస్సేన్ 5 వికెట్లు, అస్లాం 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది. జట్టులోని వంశీకృష్ణ 23, వాసుదేవరాజు 23 పరుగులతో క్రీజులో ఉన్నారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



ఆశిష్‌రెడ్డి, చిత్తూరు, (202 పరుగులు)



ధరణికుమార్‌నాయుడు, చిత్తూరు, (120 పరుగులు)



మహేంద్రారెడ్డి, అనంతపురం, (101 పరుగులు)



ఆదిల్ హుస్సేన్, కడప, (5 వికెట్లు)

సీఎం జగన్ విజన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్దాం

కడప కల్చరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్ కలిగి ఉన్నారని, దాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత సంస్థ ఉద్యోగులపై ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. శనివారం ఆయన కడప నగరంలోని కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను పరిశీలించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమ నేతలు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల చిత్రపటాలకు పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ప్రతినెల మొదటి శనివారం గ్రంథాలయాలలో నిర్వహించే మనం–మన గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రంథాలయాలను శుభ్రపరిచే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంస్థ జిల్లా చైర్ పర్సన్ లింగాల ఉషా రాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సిబ్బందితో కలిసి వారు గ్రంథాలయంలోని అన్ని గదులను శుభ్రం చేసి పుస్తకాలకు పట్టిన దుమ్మును తొలగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ పాఠకులను పలుకరించి గ్రంథాలయాల ద్వారా వారు ఆశిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మనం–మన గ్రంథాలయం కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సంస్థ జిల్లా చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర గ్రంథాలయాల వ్యవస్థలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేసి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా పాఠకుడు చందు గ్రూప్–1 పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి కమర్షియల్ ట్యాక్స్ శాఖలో ఉద్యోగం సాధించినందుకు రాష్ట్ర, జిల్లాల చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ సిబ్బందితో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్లు బాబ్జి, సుబ్రమణ్యం, నవాబ్‌జాన్, జేమ్స్, సిబ్బంది శ్రీనివాసులు, హరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఫలితాలు వెల్లడించాలి

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల నేపథ్యంలో 23 మంది న్యాయవాదుల ఓటు హక్కుకు సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన రిట్‌పిటిషన్‌ను ఉపసంహరించుకున్నామని, ఎన్నికల అధికారికి ఆగస్టు 19న కడప కోర్టు లెక్కించిన ఫలితాలను, అధికారికంగా ప్రకటించాలని నోటీసు ద్వారా కోరామని సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్ రాజు వెల్లడించారు. శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో ఆయన సమావేశం నిర్వహించారు. సురేంద్రబాబు, నలికిరిరెడ్డయ్య, జానీ, జల్లినారాయణ పాల్గొన్నారు.

పులివెందులలో అభివృద్ధి పనుల పరిశీలన

పులివెందుల రూరల్ : పులివెందులలో మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ట్రైనీ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ శనివారం పరిశీలించారు. అలాగే పట్టణ పరిధి కడప రోడ్డు సమీపంలో నూతనంగా 50 ఎకరాల్లో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవనాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నాటికి మొదటి విడత పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అనంతరం రింగురోడ్డు సమీపంలో ఉన్న 'వైఎస్సార్ ఇస్తా' స్కిల్ నైపుణ్యాభివృద్ధి అకాడమీని పరిశీలించారు. అన్ని ల్యాబ్‌లలో శిక్షణ పరికరాలు, శిక్షణ విధానాలను ఆయా ట్రైనర్లను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులను శిక్షణ, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా వైఎస్సార్ ఇస్తాను పులివెందులలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఇన్‌చార్జి చెన్నకేశవులు, కోఆర్డినేటర్ తరుణ్, జాబ్ కోఆర్డినేటర్ దివాకర్, న్యాక్ డైరెక్టర్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



చీనీమార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

చీనీకాయల మార్కెట్ పరిశీలన

పులివెందుల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న చీనీకాయల మార్కెట్‌ను ట్రైనీ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీకాయల మార్కెట్‌కు రోజూ ఎన్ని టన్నులు చీనీకాయలు వస్తున్నాయని చైర్మన్ చిన్నప్పను అడిగి తెలుసుకున్నారు. చూట్ లేకుండా చీనీ మార్కెట్‌లో కొనుగోలు ప్రారంభించడం వల్ల వివిధ ప్రాంతాల నుంచి రైతులు తాము పండించిన పంటలను తీసుకువచ్చి వేలంపాట ద్వారా విక్రయాలు చేసుకుంటున్నారని తెలిపారు. తక్కువ సమయంలోనే చీనీ మార్కెట్‌లో వ్యాపారం బాగా జరుగుతుండడం పట్ల మార్కెట్‌యార్డు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి రవీంద్రారెడ్డి, సెక్రటరీ రత్నరాజు, ఉద్యానవన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తా ఆరోపణలన్నీ అవాస్తవం

- అవన్నీ గతంలో ఆయన చేసిన పనులే
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : తనపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలేనని, అవన్నీ గతంలో ఆయన చేసిన పనులేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒక్కటీ నిజం కాదని, ఆయన లాగే అందరూ ఉంటారని అనుకోవడం తగదన్నారు. గురువింద గింజ తన నలుపు ఎరగనట్లు పుత్తా పరిస్థితి ఉందన్నారు. మాచిరెడ్డిపల్లె, దేవరాజుపల్లె, సముద్రంపల్లె, కొత్తపల్లె తదితర గ్రామాల రైతులకు చెందిన వందల ఎకరాలు భూములు ఆక్రమించుకున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ప్రతి రోజు బెంగళూరుకు ఇసుక తరలించాడని, ఎంత సంపాదించాడో ప్రజలందరికీ తెలుసన్నారు. కడపలోని ఓ సినిమా థియేటర్‌ను, బిల్టప్ వద్ద ఉన్న స్థలాన్ని ఎలా ఆక్రమించుకున్నాడో ప్రజలందరికీ తెలుసన్నారు. ఆ బాధితులంతా ఇప్పటికీ తన వద్దకు, ఎంపీ వద్దకు, అధికారుల వద్దకు తిరుగుతున్నారన్నారు. ఆయన చాలా సార్లు అధికార పార్టీలోనే ఉన్నాడని, మరి నియోజకవర్గంలో ఎప్పుడు అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. తమ గ్రామంలో సర్పంచ్‌గా గానీ, వార్డు మెంబర్‌గా గానీ గెలవని పుత్తా తన గురించి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మాచిరెడ్డిపల్లెలో కోడి పందేలు, జూదం, సారాయి దందా చేయడం తప్ప అభివృద్ధి చేసింది శూన్యం అన్నారు. అలాంటి పనులు తాను చేయలేదని, చేయబోనని స్పష్టం చేశారు. తనపై అవాకులు చెవాకులు పేలడం మానుకోవాలని, నీలాంటి వాళ్లను చాలా మందిని చూశానని, ఇప్పటికైనా విజ్ఞతతో ఉండాలని హితవు పలికారు. మహానేత వైఎస్సార్ చలువతో ఎంఎల్‌సీ అనే ట్యాగ్ తగిలించుకున్నావని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన అరాచకాల వల్ల భూములు కోల్పోయిన బాధితులు వందల మంది గ్రామాలు వదిలి వెళ్లారని తెలిపారు. కమలాపురం పట్టణంలో రూ. 230 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అవన్నీ పూర్తి అయితే ప్రజలు వైఎస్సార్ సీపీని, సీఎంను, తనన్ను తప్పకుండా మెచ్చుకుంటారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రౌడీయిజం మానుకొని విజ్ఞతతో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, గంగాధర్‌రెడ్డి, గండి భాస్కర్, షాషావలి, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



సందీప్ మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–కృష్ణాపురం రైల్వే మార్గంలోని ఎగువ రైలు పట్టాలపై టంగుటూరి సందీప్ (27) అనే యువకుడి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసవర్మ తెలిపారు. చెన్నూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన టంగుటూరి సందీప్ కడప నగరంలోని ఓ ప్రైవేటు చిన్న పిల్లల ఆస్పత్రిలో పని చేస్తుండే వాడన్నారు. శనివారం సాయంత్రం చెన్నై–ముంబయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలయరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని తెలియజేశారు.

కోనేరులో పడి వృద్ధురాలి మృతి

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడు గ్రామానికి చెందిన సానేపల్లె నాగాలమ్మ (70) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగాలమ్మ భర్త కొండారెడ్డి మృతి చెందడంతో ఆమె తన చిన్న కుమార్తె పద్మావతి వద్ద నివసిస్తోంది. నాగాలమ్మ మతిస్థిమితం లేని కారణంగా అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చేది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అక్కడక్కడా వెతికారు. ఎలాంటి ఆచూకీ లభించక పోవడంతో ఎదురుచూశారు. కాగా గ్రామ సమీపంలోని కోనేటిలో దుర్వాసన రావడంతోపాటు శవం నీటిపై తేలియాడుతుండటంతో కుటుంబ సభ్యులకు స్థానికులు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ చిన్నపెద్దయ్య శనివారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని కోనేటి నుంచి బయటకు తీశారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు



కర దీపికను ఆవిష్కరిస్తున్న పరిశ్రమల శాఖ సలహాదారు రాజోలి వీరారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పారిశ్రామిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లాలోని వనరులు, నూతన పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు తదితర అంశాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన పారిశ్రామిక విధానం ఐడీపీ 2023–27కు సంబంధించిన కరదీపికను పరిశ్రమలశాఖ సలహాదారు రాజోలి వీరారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



కళ్యాణి (ఫైల్)

కడప అర్బన్ : చింతకొమ్మదిన్నె మండలం అంగడి వీధికి చెందిన కళ్యాణి (20) అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఆ యువతి తల్లిదండ్రులు విజయకుమారి, చిట్టిబోయిన ప్రతాప్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైవీ స్ట్రీట్‌కు ఈ నెల 6న కళ్యాణిని ఆమె తల్లి షాపింగ్ కోసం పిలుచుకుని వచ్చింది. యువతిని వేంపల్లి మండలం తాళ్లపల్లికి చెందిన అమర్ అనే యువకుడు బలవంతంగా తీసుకుని వెళ్లాడనే అనుమానంగా వుందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ ఎన్వీ నాగరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

డీఈఓపై పీడీ విచారణ



విద్యార్థి సంఘ నాయకులను విచారణ చేస్తున్న పీడీ ఆనంద్‌నాయక్

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ శనివారం తమ కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్‌కుమార్, నగిలి రాజేంద్ర ప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ విచారణకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు పీడీతో మాట్లాడుతూ ఉపాధ్యాయులను అసభ్య పదజాలంతో దూషిస్తూ మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వీటితోపాటు పలు ఆరోపణలు చేశారు. వీటికి సంబంధించిన పత్రాలను ఆయనకు వారు అందజేశారు. లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

మదనపల్లెలో ఎస్‌జీఎఫ్ పోటీల సందడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

- అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలకు మదనపల్లె జెడ్పీహైస్కూల్ వేదికైంది. కరోనాతో మూడేళ్ల పాటు నిలిచిపోయిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు తిరిగి ప్రారంభమవడంతో సందడి నెలకొంది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుల రాకతో జెడ్పీ హైస్కూల్‌లో పండుగ వాతావరణం కనిపించింది. మూడు రోజుల పాటు జెడ్పీ హైస్కూల్‌లో జరిగే అంతరజిల్లా ఫుట్‌బాల్(అండర్ 19 బాలురు, బాలికల) పోటీలను ఎమ్మెల్యే నవాజ్‌బాషా శనివారం ప్రారంభించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ జయరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఎమ్మెల్యే జెండా ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఫుట్‌బాల్ కోర్టులో స్వయంగా బాల్‌ను కాలుతో తన్ని గోల్ వేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ అంతరజిల్లా ఫుట్‌బాల్ క్రీడాపోటీలకు మదనపల్లె వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన క్రీడాకారులు ఫుట్‌బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనపరిచాలన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ జయరామయ్య మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో క్రీడాభిమానులకు పండగ రోజని, ఈ ఏడాది అండర్–19 ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ అంతరజిల్లాల పోటీలు రెండూ ఇక్కడే నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగుచంద్ర, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌ఆజం, వైఎస్సార్‌సీపీ నాయకులు నారదరెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, తట్టిశ్రీనివాసులురెడ్డి, గొడసాని వెంకటరమణ, కత్తిరాజు, బాలగంగాధరరెడ్డి, పీడీలు అన్సర్‌బాషా, రాము, కిశోర్, సుధాకర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

67వ ఎస్‌జీఎఫ్ అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీల్లో మొదటిరోజైన శనివారం హోరాహోరీగా పోటీలు జరిగాయి. అండర్–19 బాలుర విభాగంలో చిత్తూరు, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు 3 గోల్స్, గుంటూరు, శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీల్లో గుంటూరు 8 గోల్స్ చేశాయి. కృష్ణ, విజయనగరం మధ్య జరిగిన పోటీల్లో ఇరుజట్లు టైగా నిలిచాయి. విశాఖపట్నం, పశ్చిమగోదావరి మధ్య జరిగిన పోటీల్లో 2 గోల్స్‌తో విశాఖజట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో విశాఖపట్నం–పశ్చిమగోదావరి మధ్య జరిగిన పోటీల్లో 2–2 ఫలితాలతో టై, గుంటూరు, విజయనగరం మధ్య గుంటూరు 4 గోల్స్, శ్రీకాకుళం–వైఎస్సార్ కడప మధ్య పోటీల్లో శ్రీకాకుళం వాక్‌ఓవర్ కాగా, కృష్ణ, చిత్తూరు మధ్య పోటీల్లో టై, ప్రకాశం, వెస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం 2 గోల్స్‌తో విజేతగా నిలిచింది.